''ఈరోజు నేనొక్కదాన్ని నిన్ను 'కీప్' అంటే నీకింత రోషం వచ్చిందే. రేపు ఇంకా ఎంతమంది అంటుంటే నువ్వు భరించాలో. ఒకసారి నువ్వు మా ఆయనకి లొంగిపోతే జీవితాంతం నీకా ముద్ర తప్పదు తెలుసా?''

''అక్కా, నన్ను క్షమించక్కా, నన్ను... నన్ను ఈ ఆపద నుండి తప్పించక్కా!'' అంటూ కళ్లనీళ్లతో వేడుకుంది జయంతి.

''మీ నాన్నకి ఉత్తరం వ్రాస్తాను. మంచి సంబంధమొకటి నా దృష్టిలో వుంది, చేసేసుకో! నీ విషయాలేవీ బావకు తెలియనివ్వకు. అసలిక్కడకు నీ పెళ్లయ్యేదాకా రాకు!'' అని చెప్పింది సుమతి.

''ఏంటలా ఉండిపోయావ్!'' జయంతిని కుదుపుతూ అంది సుమతి.

''బావనీ విషయం అడిగావా?'' తలవంచుకుని అడిగింది.

''ఎందుకు? నాకు తెలిసింది కాబట్టి ఇదడుగుతాను. తెలియక ఇంకెన్నో!''

''నీకీ ఓర్పు ఎలా వచ్చిందక్కా!''

''ఆ దేవుడిచ్చాడు'' చేతులు పైకెత్తి చూపిస్తూ అని లోపలికెళ్లిపోయింది.

'క్షమయా ధరిత్రి!' అని స్త్రీని ఎందుకంటారో అప్పుడర్థమైంది జయంతికి. ముందు ముందు ఈ పాఠం తనకెలా పనికొస్తుందోనని ఆలోచిస్తూ ఉండిపోయింది.

**-కె. లలితారాజ్** (ఒంగోలు)

# మార్పు

గురువారం కనుక సాయిబాబా గుడి రష్‌గా వుంది. జయంత్ దైవదర్శనం చేసుకుని ఆఫీసుకు బయల్దేరాడు. కొంతదూరం రాగానే అతని దృష్టి ఆ అమ్మాయిపై పడింది. చాలా అందంగా ఉందా అమ్మాయి. భుజానికి హేండ్‌బ్యాగ్ తగిలించుకొని వడి వడిగా నడుస్తోంది.

బహుశ ఆఫీసుకో, కాలేజీకో టైము అయిపోతున్నది కాబోలు. గుడి ఊరికి రెండుమైళ్ళ దూరంలో ఉంది. ఆటోలు దొరకవు. ముందే ఇంటి దగ్గర మాట్లాడుకొని రావాలి. టౌను బస్సు యింకా ఆ రూటులో వేయలేదు. భక్తులకు యిబ్బందే అయినా భగవంతుణ్ణి చూడాలనుకొనేవారు ఆ మాత్రమైనా కష్టపడకపోతే ఎలా?



ఆలోచనల్నుంచి తేరుకొని ఆమె వైపు చూశాడు. ఎండలో వేగంగా నడవటం వల్ల చెమటలు పడుతుంటే చేతిరుమాలుతో తుడుచుకొంటూనే నడవసాగింది. ఆమె అవస్థ చూసి జయంత్‌కి జాలేసింది. బైక్‌ను ఆమె ప్రక్కన ఆపి ''నేను టౌన్ వైపే వెళ్తున్నాను. మీకు లిఫ్టు కావాలంటే రండి'' అని అడిగాడు.

ముందు అతని వైపు కోపంగా చూసిందామె. తర్వాత వెనుకకు చూసి దూరంగా వస్తున్న ఓ ముసలావిడను చూపిస్తూ ''మీది అంత జాలి గుండైతే ఆ ముసలావిడకు లిఫ్టివ్వండి. మీకు పుణ్యమూ వస్తుంది. మీ చెంప జాగ్రత్తగానూ ఉంటుంది'' అని తిరిగి వేగంగా నడవసాగింది.

చాలా అవమానంగా ఫీలయ్యాడు జయంత్.

అసలు తను యిలా ఒక ఆడపిల్లను 'లిఫ్ట్ కావాలా' అని అడగడమే తన జీవితంలో మొదటిసారి. ఆమె అవస్థ చూసి సాటి మనిషిగా సహాయం చేద్దామని అడిగాడేగాని మరో దురుద్దేశం లేదు తనకు. తన సాయం అక్కర్లేదనుకొంటే ఏదో ఒకటి మర్యాదగా చెప్పి తప్పించుకోవచ్చు కదా. ఇంత అందమైన ముఖానికి అంత కఠినమైన మనస్సు ఎందుకిచ్చాడో ఆ భగవంతుడు.

మోటార్ బైక్‌ను స్టార్ట్ చేస్తూ అనుకున్నాడు జయంత్.

★ ★ ★

తల్లి నిద్ర లేపితే మెలకువ వచ్చింది నిర్మలకి. అక్కకు నొప్పులు మొదలయినాయట. తండ్రి క్యాంపుకెళ్ళాడు. ఇంట్లో ముగ్గురూ ఆడవాళ్ళే. సమయం రాత్రి పదకొండున్నరయింది. ఏమి చేయాలో తోచలేదు నిర్మలకు. అక్కకాన్పు దగ్గరకొచ్చినా లీవు పెట్టని తండ్రిమీద, ఫోన్‌కు అప్లయి చేసి సంవత్సరమైనా యింకా యివ్వని టెలిఫోన్ డిపార్ట్‌మెంట్ మీదా కోపం వచ్చింది నిర్మలకు.

''అమ్మా, ప్రక్కనున్న ఎస్.టి.డి బూత్‌కెళ్ళి రమ వాళ్ళ అన్నయ్యను రమ్మంటాను. నీవు అక్కను చూస్తూండు'' చెప్పులేసుకొంటూ అంది.

''ఇంత అర్ధరాత్రి బయటికి ఎలా వెళ్తావే?''

తల్లి ప్రశ్నని పట్టించుకోకుండా నాలుగిళ్ళకవతల వున్న ఎస్.టి.డి బూత్‌లో అడుగుపెట్టి కౌంటర్ ముందున్న వ్యక్తిని చూసి ఆశ్చర్యపోయింది. అతను గుడి దగ్గర లిఫ్ట్ కావాలా అని అడిగినతను.

''ఏమిటి.. ఇంతరాత్రి..'' ఆశ్చర్యంగా అడిగాడు జయంత్.

''మా అక్కకు పెయిన్స్'' ఆందోళన వల్ల ఆమెకు ఏడుపు వచ్చేసింది.

''మరేం ఫర్వాలేదు. డోంట్ వర్రీ. ఏ హాస్పిటల్‌కి తీసుకెళ్ళాలి? మీ యిల్లెక్కడుంది?'' అనునయిస్తూ అడిగాడు. ఆమె చెప్పింది. జయంత్ వెంటనే తన ఫ్రెండ్‌కు ఫోన్ చేశాడు.

ఐదు నిమిషాల్లో కారు వచ్చింది. జయంత్ షాపు లాక్ చేసుకొని వాళ్ళకు తోడుగా హాస్పిటల్‌కు వెళ్ళాడు. నిర్మల అక్క ఉదయం నాలుగు గంటలకు ప్రసవించింది. అంతవరకూ తనతోనే ఉండి ధైర్యం చెప్పిన జయంత్‌కి థ్యాంక్స్ చెప్పి గుడి దగ్గర తన ప్రవర్తనకు క్షమాపణ చెప్పింది.

''ఫర్వాలేదండి. ఆ షాపు మా ఫ్రెండ్‌ది. వాడు వూరెళ్తూ ఈరోజు నన్ను చూసుకోమన్నాడు. అయితే నేనే కాదు అక్కడ ఎవరున్నా మీకు సహాయం చేసేవారు.''

''వాళ్ళు చేయడం సహజమే. కానీ, మిమ్మల్ని నొప్పించినా నాకు సహాయం చేశారు. మీ ప్రవర్తనతో నాలో పరివర్తన తెచ్చారు. ఇకనుంచీ నేను ఎవరితోనూ పరుషంగా మాట్లాడి వాళ్ళ మనసు నొప్పించనని మీకు మాట ఇస్తున్నాను'' అంది నిర్మల.

''వెరీగుడ్. సమాజంలో ఎదుటి మనిషి ఫీలింగ్స్‌ని పట్టించుకొనేవాళ్ళే కరువవుతున్నారు. కనీసం మనలాంటి చదువుకొన్నవాళ్ళయినా అలాకాకుండా ఉండాలి'' సంతోషంగా అన్నాడు జయంత్.

**-సి.ఎస్.చంద్రశేఖర్ (చిత్తూరు)**